క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

నల్లగొండ: పట్టణంలోని 11కేవీఏ సబ్ స్టేషన్ పరిధిలో చెట్ల కొమ్మలు కొడుతున్నందున గురువారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ ఎం.వేణుగోపాలచార్యులు ఒక ప్రకటనలో తెలిపారు. రైల్వే కాలనీ, పానగల్, శ్రీనగర్ కాలనీ, శ్రీరాంనగర్, హనుమాన్ నగర్, శివాజీ నగర్, గాంధీ నగర్, ఎన్‌జీఓ కాలనీ, వైకుంఠపురం, అమూల్య కాలనీ, సావర్కర్ నగర్, వీటీకాలనీ, విద్యుత్ నగర్, తిరుమల నగర్, నేతాజీ నగర్ కాలనీల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు.

నిరుపేద కుటుంబానికి చేయూత



బియ్యం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

కేతేపల్లి: మండల కేంద్రంలో నిరుపేద కుటుంబానికి చెందిన పల్లె చంద్రమ్మ అనారోగ్యంతో ఇటీవల మృతి చెందింది. మాజీ ఎమ్మెల్యే దైద సుందరయ్య ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి బియ్యం, ఇతర నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో టీపీసీసీ ముస్లిం మైనార్టీ సెల్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఎండీ.యూసుఫ్‌జానీ, కొప్పుల అమర్నాథరెడ్డి, బయ్య ముత్తయ్య, చింతా ఆంద్రయ్య, పల్లె గుర్వయ్య, దండెం జోజి పాల్గొన్నారు.

బెల్టు షాపులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటాం

చండూరు(గట్టుప్పల్) : బెల్టు షాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని గట్టుప్పల్ ఎస్‌ఐ గుత్తా వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో బెల్టు షాపులపై సిబ్బందితో కలిసి తనిఖీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవించకూడదని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని సూచించారు. ఆయన వెంట హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు, సిబ్బంది ఉన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌తో విద్యార్థులు

మర్రిగూడ : మండలంలోని శివన్నగూడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులకు బుధవారం పాఠశాల పూర్వ విద్యార్థి జాల వెంకటేష్ తన తండ్రి జాల జంగయ్య జ్ఞాపకార్థం ఆల్ ఇన్ వన్ స్టడీ మెటీరియల్స్ అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు శారద, మాజీ సర్పంచ్ చిట్యాల సబితాయాదగిరిరెడ్డి, మాజీ ఎంపీటీసీ దాసరి మమతగోపాల్, మునగాల వెంకట్‌రెడ్డి, ఊరె రమేష్, ఉపాధ్యాయులు సైదిరెడ్డి, అనురాధ, యాదయ్య, వెంకటేశ్వర్లు, చంద్రయ్య, శ్రీనయ్య, మధు పాల్గొన్నారు.

కమిషనర్‌కు వినతి

చౌటుప్పల్ : రాష్ట్ర ప్రభుత్వం చేనేత కార్మికులకు ప్రకటించిన రుణమాఫీ నగదును చేనేత సహకార సంఘాల ఖాతాల్లో జమ చేయించాలని చేనేత ప్రతినిధులు బుధవారం డీసీసీబీ మాజీ డైరెక్టర్ పిల్లలమర్రి శ్రీనివాస్ ఆధ్వర్యంలో చేనేత, జౌళి శాఖ కమిషనర్ శైలజారామయ్యర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. రుణమాఫీని ప్రకటించి మూడు నెలలు గడుస్తున్న ఇంకా ఆ ప్రక్రియ పూర్తి కాలేదన్నారు. సహకార బ్యాంకుల క్యాష్ క్రెడిక్ రుణాలను మాఫీ చేయించాలన్నారు. సంఘాల బలోపేతానికి గ్రాంట్ రూపంలో ప్రభుత్వం నుంచి రూ.100కోట్లు మంజూరు చేయించాలని కోరారు. ఆలిండియా హ్యాండ్లూమ్ బోర్డు మాజీ డైరెక్టర్ భారత వాసుదేవ్, చేనేత సహకార సంఘాల మాజీ అధ్యక్షుడు అప్పం రామేశ్వరం, నకిరేకల్ సహకార సంఘం అధ్యక్షుడు చిలుకూరు లక్ష్మీనర్సయ్య ఉన్నారు.

సభ్యత్వ నమోదు



సభ్యత్వ నమోదులో పాల్గొన్న ట్రైబల్ టీచర్ అసోసియేషన్ సభ్యులు

మర్రిగూడ : ట్రైబల్ టీచర్ అసోసియేషన్ మండల శాఖ సభ్యత్వ నమోదును బుధవారం మర్రిగూడలో నిర్వహించారు. కార్యక్రమంలో ట్రైబల్ టీచర్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఉదావత్ లచ్చిరాం, జాయింట్ సెక్రటరీ సపావత్ వెంకట్‌కుమార్‌నాయక్, జిల్లా అధ్యక్షుడు కెతావత్ శ్రీరామ్, రమావత్ విఠల్, ప్రధాన కార్యదర్శి నేనావత్ రమేష్‌నాయక్, మండల శాఖ ఉపాధ్యక్షుడు రమేష్‌బాబు, కోశాధికారి తిరుపతయ్య, సభ్యులు లక్ష్మి, ప్రియాంక తదితరులు పాల్గొన్నారు.

వీధి కుక్కల స్వైర విహారం !

- వందల సంఖ్యలో కుక్క కాటు బాధితులు
- ప్రమాదాల బారిన పడుతున్న వాహనదారులు
- నివారణ చర్యలు తీసుకోని అధికారులు



మర్రిగూడలో సంచరిస్తున్న కుక్కలు

మర్రిగూడ : వీధి కుక్కలు గ్రామాల్లో స్వైర విహారం చేస్తుండడంతో అనేకమంది కుక్కకాటు బారిన పడుతున్నారు. ద్విచక్ర వాహనాలకు కుక్కలు ఒక్కసారిగా అడ్డుపడుతుండడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్న సంఘటనలు అనేకం చోటుచేసుకుంటున్నాయి. మర్రిగూడ మండల వ్యాప్తంగా 18 గ్రామపంచాయతీల్లో దాదాపు 800 నుంచి 900 కుక్కలు ఉన్నట్లు సమాచారం. మండలంలో అనేక మంది కుక్క కాటు బారిన పడి, కుక్కల వల్ల రోడ్డు ప్రమాదాలకు గురై ఆస్పత్రిలో చికిత్స చేయించుకునేవారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతోంది. కుక్కలకు శస్త్ర చికిత్స చేయడం ద్వారా వాటి సంఖ్యను తగ్గించాలని, వాటిని దూర ప్రాంతాలకు తరలించాలని ప్రజలు కోరుతున్నా గ్రామ పంచాయతీ సిబ్బంది, అధికారులు చొరవ చూపడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలోని ప్రధాన రహదారి వెంట, వ్యాపార దుకాణాల వద్ద కుక్కల సమూహాలు అధికంగా దర్శనమిస్తున్నాయి.

ఆస్పత్రికి నెలకు పదుల సంఖ్యలో బాధితులు

అనారోగ్యానికి గురైన పలువురు మర్రిగూడ సీహెచ్‌సీ ఆస్పత్రికి వెళ్తే ఆస్పత్రి పరిసర ప్రాంతాల్లో ఉన్న కుక్కలు పలువురిని కరిచి గాయపరిచిన ఘటనలు ఇటీవల చోటుచేసుకున్నాయి. జ్వరం వచ్చిందని ఆస్పత్రికి వస్తే కుక్క కాటుకు గురికావడంతో మూలిగే నక్కపై తాటికాయ పడిన చందంగా మారిందని బాధితులు వాపోతున్నారు. కుక్క కాటుకు గురైన బాధితులు మర్రిగూడ సీహెచ్‌సీకి నెలకు పదుల సంఖ్యలో వస్తున్నారని అక్కడి వైద్యులు చెబుతున్నారు. మర్రిగూడ మండలంలో 2024 జనవరి నుంచి డిసెంబర్ వరకు మొత్తం 507 మందిని కుక్కలు కరిచాయని వైద్యులు చెబుతున్నారు. అందులో పురుషులు – 258 మంది, స్త్రీలు– 107, చిన్నారులు –142 మంది ఉన్నారు. మర్రిగూడ సీహెచ్‌సీలో కుక్కకాటుకు వ్యాక్సిన్ అందుబాటులో ఉందని, కుక్క కరిచినట్లయితే నిర్లక్ష్యం చేయవద్దని వైద్యులు సూచిస్తున్నారు.

రేబిస్ సోకే ప్రమాదం..

కుక్క కాటుతో రేబిస్ వ్యాధి సోకే ప్రమాదం ఉంది. కుక్క కరిస్తే వెంటనే గాయాన్ని 10–15 నిమిషాల పాటు నీటితో శుభ్రం చేయాలి. యాంటి రేబిస్ వ్యాక్సిన్ తప్పనిసరిగా తీసుకోవాలి. రేబిస్ సోకితే తొలి దశలో జ్వరం, తలనొప్పి, వాంతులు, నోట్లో నుంచి నురుగు, గొంతు పట్టేయడం, ఊపిరి ఆడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. చివరికి కోమాలోకి వెళ్లి ప్రాణాలు పోయే ప్రమాదం పొంచి ఉంటుందని, కుక్క కాటుకు గురైన వారు తగు జాగ్రత్తలు తీసుకోవడం మంచిదని వైద్యులు తెలుపుతున్నారు. ఈ విషయమై ఎంపీఓను వివరణ కోరగా మండలంలోని డాగ్ క్యాచర్ల ద్వారా వీధి కుక్కలను పట్టుకుని దూర ప్రాంతాలకు తరలిస్తామని అన్నారు.

ఆస్పత్రికి వెళ్తే కుక్క కరిచింది



జ్వరం వచ్చిందని ప్రభుత్వ ఆస్పత్రిలో చూపించుకోవడానికి వెళ్తే ఆస్పత్రి ప్రాంగణంలో ఉన్న కుక్క కరిచింది. నా కంటే ముందు మరో ముగ్గురు, నలుగురిని కూడా ఆస్పత్రి ఆవరణలో కుక్క కరిచినట్లు సిబ్బంది చెబుతున్నారు. వైద్యులు, పంచాయతీ కార్యదర్శి చొరవ తీసుకుని కుక్కలను ఆస్పత్రి నుంచి తొలగించాలి.

–పల్లె మల్లేష్, మర్రిగూడ

షెల్టర్ హోం ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం



మర్రిగూడ మండల వ్యాప్తంగా 800 నుంచి 850 వరకు కుక్కలు ఉండవచ్చని అంచనా. వీధి కుక్కల విషయమై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి గ్రామస్థాయి లేదా మండల స్థాయిలో షెల్టర్ హోమ్స్ ఏర్పాటు చేసేలా కృషి చేస్తాం. కుక్కలను పట్టేందుకు తగిన శిక్షణ ఇచ్చి ప్రతి కుక్కకు రేబిస్ వ్యాధి సోకకుండా వ్యాక్సిన్ ఇప్పించేలా చూస్తాం. కుక్కలకు కుటుంబ నియంత్రణ చికిత్స చేస్తే వాటి సంఖ్య తగ్గుతుంది.

– పి.సురేందర్, పశు వైద్యాధికారి

ప్రజల బతుకులు మార్చండి

- నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య



మాట్లాడుతున్న చిరుమర్తి లింగయ్య

నకిరేకల్ : విగ్రహాలను మార్చడం కాదు.. ప్రజల బతుకులు మార్చాలని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య ప్రభుత్వాన్ని కోరారు. నకిరేకల్‌లోని తన కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఒక వైపు తెలంగాణ తల్లి విగ్రహం ఏర్పాటు చేశామని గొప్పలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వం.. మరో వైపు క్షేత్రస్థాయిలో ఆశా వర్కర్లపై దాడులు చేయడాన్ని ఖండించారు. కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రభుత్వాన్ని అడగడానికి వచ్చిన ఆశా కార్యకర్తలపై పోలీసులు అమానుషంగా ప్రవర్తించడం సరైంది కాదన్నారు. ఈ సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొప్పుల ప్రదీప్‌రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ రాచకొండ శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ప్రగడపు నవీన్‌రావు, నకిరేకల్ మాజీ ఎంపీటీసీ గుర్రం గణేశ్ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌కు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న ఎంఈఓ

చిట్యాల: శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జిల్లా విద్యాశాఖ, తెలంగాణ గణిత ఫోరం ఆధ్వర్యంలో గత నెల చిట్యాల మండలంలోని పదో తరగతి విద్యార్థులకు నిర్వహించిన మండల స్థాయి మ్యాథ్స్ టాలెంట్ టెస్ట్‌లో పలువురు విద్యార్థులు ప్రతిభ కనబర్చిన జిల్లా స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా బుధవారం విద్యార్థులను ఎంఈఓ పానుగోతు సైదానాయక్ అభినందించారు. జిల్లా స్థాయి టాలెంట్ టెస్ట్‌కు ఇంగ్లిష్ మీడియం విభాగంలో ఎస్.శివకార్తీక్(వెలిమినేడు), కే.శృతి(నేరడ), అక్షిత(గుండ్రాంపల్లి), బి.అభినయశ్రీ(నేరడ), కే.శిరీష(గుండ్రాంపల్లి), వంశీకృష్ణ(గుండ్రాంపల్లి) ఎంపికయ్యారు. తెలుగు మీడియం విభాగంలో బి.మల్లేష్(వనిపాకల), యం.హరిణి(వనిపాకల), బి.ధనలక్ష్మీ(వనిపాకల), ఇరగదిండ్ల గణేశ్ (చిట్యాల) ఎంపికయ్యారు. తెలంగాణ మ్యాథ్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు దాసరి శ్రీరాములు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఫోరం అబ్జర్వర్ దూదిగామ స్వామి, మండల కన్వీనర్ రామ్ భూపాల్, హెచ్‌ఎంలు జి.మాధవి, వెంకట్‌రెడ్డి, గణిత ఉపాధ్యాయులు అష్రఫ్, యాదగిరిరెడ్డి, సైదులు, శైలజ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేసిన కాంగ్రెస్



నియామక పత్రాలు అందజేస్తున్న నాయకులు

నల్లగొండ టూటౌన్ : గత అసెంబ్లీ ఎన్నికల్లో అనేక హామీలు ఇచ్చిన కాంగ్రెస్ పార్టీ.. హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేసిందని బీజేపీ రాష్ట్ర కార్యదర్శి మాదగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం నల్లగొండ పట్టణంలోని ఎన్జీబీ కాలనీలో బూత్ కమిటీ అధ్యక్ష ఎన్నిక సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతు రుణమాఫీ సగం మందికి ఎగ్గొట్టారని, వానాకాలం రైతుబంధు ఇవ్వకుండా రైతాంగాన్ని మాయమాటలతో మోసం చేశారని ఆరోపించారు. వృద్ధులకు, దివ్యాంగులకు పెంఛన్లు పెంచలేదని, మహిళలకు నెలకు రూ. 2500, విద్యార్థులకు స్కూటీలు ఇస్తామని మోసం చేశారన్నారు. అనంతరం నాలుగు బూత్ కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో బీజేపీ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బండారు ప్రసాద్, సీనియర్ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, దాయం భూపాల్‌రెడ్డి, బొజ్జ నాగరాజు, మిర్యాల వెంకటేశం, గుర్రం ధనలక్ష్మీ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

అధ్యాపకురాలికి డాక్టరేట్



వసంత

నల్లగొండ రూరల్: పట్టణంలోని మహిళా డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు వసంతకు ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ లభించింది. ఓయూలో ప్రొఫెసర్ హరిప్రియశ్రీ పర్యవేక్షణలో సూర్య కాంతి, దుర్యోత్సార కాంతి అంశంపై పరిశోధనలు చేసినందుకు డాక్టరేట్ లభించినట్లు బుధవారం వసంత తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, అధ్యాపకులు సాలయ్య, మంజుల, శ్రీనివాస్, సుభాష్‌రెడ్డి, వెంకటకృష్ణ, ఉపేందర్‌లు ఆమెను అభినందించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి



రఘుమారెడ్డిని సత్కరిస్తున్న నాయకులు

చిట్యాల: రాష్ట్ర ప్రభుత్వం పేదల సంక్షేమానికి ప్రవేశపెట్టి అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను యువజన కాంగ్రెస్ నాయకులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు ఏనుగు రఘుమారెడ్డి అన్నారు. నకిరేకల్ నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడిగా ఎన్నికైన రఘుమారెడ్డిని బుధవారం వెలిమినేడు గ్రామంలో ఆ గ్రామ యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రఘుమారెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలో యువజన కాంగ్రెస్ బలోపేతానికి కృషి చేయాలన్నారు. చీమల సతీష్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అర్రూరి శివకుమార్, పంది భాస్కర్, మేడబోయిన నరేష్, గోలి నరేష్, వీరమళ్ల కిరణ్, రూపని అజిత్, భానురెడ్డి, గాదె ప్రశాంత్, శ్రీశైలం, మెట్టు మధు, సిద్ధు, దేవిరెడ్డి అనిల్‌రెడ్డి పాల్గొన్నారు.

జర్నలిస్టులపై దాడి హేయమైన చర్య



రాస్తారోకో చేస్తున్న జర్నలిస్టులు

నల్లగొండ టూటౌన్ : జర్నలిస్టులపై దాడి చేయడం హేయమైన చర్య అని ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు యెరెడ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గౌరవాధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి అన్నారు. హైదరాబాద్‌లో జర్నలిస్టులపై సినీ నటుడు మోహన్‌బాబు దాడి చేయడాన్ని నిరసిస్తూ ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం రామగిరి నుంచి పెద్ద గడియారం సెంటర్ వరకు ర్యాలీ, రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మోహన్‌బాబు వెంటనే జర్నలిస్టులకు భేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. మోహన్‌బాబుపై కేసు నమోదు చేసి చట్టప్రకారం శిక్షించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టు రేవన్‌రెడ్డి, ప్రెస్‌క్లబ్ బాధ్యులు మాధురి యాదగిరి, జూలకంటి అశోక్‌రెడ్డి, కట్ట సుధాకర్, నేతి ఉపేందర్, దొమ్మాట విజయభాస్కర్, పిట్టల రామకృష్ణ, గోలి విజయ్, కంచర్ల అంజయ్య, మట్టయ్య, ఉయ్యాల లింగయ్య గౌడ్, రవీందర్‌రెడ్డి, కంది భజరంగ్‌ప్రసాద్, భాస్కర్, సత్యం, కంది శ్రీనివాస్, శ్రీధర్, చాంద్, అతిక్ అహ్మద్, బోయపల్లి రమేష్, స్రవంతి, మల్లేష్, రాంప్రసాద్, దశరథ, రవి, సంపూర్ణ, రమేష్, భవానీప్రసాద్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

క్రికెట్ పోటీలకు విశేష స్పందన

నల్లగొండ: జిల్లా కేంద్రంలోని ఎన్జీ కళాశాలలో ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న నల్లగొండ ప్రీమియర్ లీగ్–5 క్రికెట్ పోటీలకు విశేష స్పందన లభిస్తోందని మున్సిపల్ వైస్ చైర్మన్ అబ్బగోని రమేష్ గౌడ్ అన్నారు. బుధవారం క్రికెట్ లీగ్ పోటీలను ఆయన తిలకించారు. అనంతరం మాట్లాడుతూ క్రీడాకారులను ప్రోత్సహించడానికి ప్రతీక్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంత్రి కోమటిరెడ్డి ప్రతి సంవత్సరం క్రీడా పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తున్నారన్నారు. ఈ పోటీల్లో మొత్తం 64 జట్లు పాల్గొన్నాయని పేర్కొన్నారు. ఈ నెల 20 వరకు క్రీడా పోటీలు జరుగుతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు కేసాని వేణుగోపాల్ రెడ్డి, ప్రదీప్ నాయక్, ఆలకుంట్ల మోహన్ బాబు, ఏర్పుల రవి, ముత్తినేని నాగేశ్వర రావు, బోనగిరి ప్రభాకర్, శ్రీధర్, ఏర్పుల శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

వరి కొయ్యలను భూమిలో కలియదున్నాలి



అవగాహన కల్పిస్తున్న ఏఓ పురుషోత్తం

కేతేపల్లి: రైతులు వరిపంట కోసిన అనంతరం కొయ్యలను కాల్చకుండా భూమిలో కలియదున్నాలని కేతేపల్లి ఏఓ బి.పురుషోత్తం సూచించారు. వరి కొయ్యలను కాల్చడం వల్ల కలిగే అనర్థాలపై బుధవారం కొప్పోలు గ్రామంలో రైతులకు నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆయన మాట్లాడారు. వరి కొయ్యలను కాల్చినట్లయితే భూమిలో మేలు చేసే మిత్ర పురుగులు, ఇతర సూక్ష్మజీవులు చనిపోవడంతో సమతుల్యత దెబ్బతిని భూసారం తగ్గుతుందన్నారు. మట్టిలోని నీటినిల్వ సామర్థ్యం తగ్గి పంటకు అధిక నీటి అవసరం ఏర్పడుతుందన్నారు. వరి కొయ్యలను భూమిలో కలిపి దున్నినట్లయితే సేంద్రియ ఎరువుగా మారి భూమికి మేలు జరుగుతుందని తెలిపారు. పంట సాగులో డీఏపీకి బదులుగా తక్కువ ధరకు లభించే నానో డీఏపీని వాడి సాగు ఖర్చులు తగ్గించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఈఓ ఉమేష్, రైతులు ఉపేందర్ రెడ్డి, లింగస్వామి, రమేష్, బాబు తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలు చేయాలని వినతి



వినతిపత్రం అందజేస్తున్న బీజేపీ నాయకులు

నల్లగొండ టూటౌన్ : ఎస్సీ వర్గీకరణ వెంటనే అమలు చేయాలని కోరుతూ బుధవారం బీజేపీ నాయకులు నల్లగొండ కలెక్టరేట్‌లో ఏకసభ్య కమిషన్ చైర్మన్ షమీమ్ అక్తర్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం బీజేపీ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ నాగం వర్షిత్‌రెడ్డి మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు బీజేపీ సంపూర్ణ మద్దతు తెలియజేస్తోందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం కాలయాపన చేయకుండా త్వరగా వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ సీనియర్ నేత గోలి మధుసూదన్‌రెడ్డి, పోతెపాక సాంబయ్య, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు పెరిక మునికుమార్, ఎడ్ల రమేష్, కొత్తపల్లి వెంకట్, జిల్లా కిశోర్, శాంతస్వరూప్, శ్యామ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

చర్యలు తీసుకోవాలి

చిట్యాల: ఎల్రక్టానిక్ మీడియా ప్రతినిధి రంజిత్‌పై దాడి చేసిన సినీ నటుడు మోహన్‌బాబుపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని తెలంగాణ మలి దశ ఉద్యమకారుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు కునూరు సంజయ్‌దాస్‌గౌడ్ బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జర్నలిస్టుల రక్షణకు ప్రభుత్వం ప్రత్యేక చట్టాలను రూపొందించి అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

నేడు రాజకీయ పార్టీ ప్రతినిధులకు సమావేశం

చిట్యాల: గ్రామ పంచాయతీ ఎన్నిల నిర్వహణకుగాను పోలింగ్ కేంద్రాల జాబితాల అభ్యంతరాలపై గురువారం చిట్యాల ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జయలక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. మధ్యాహ్నం రెండు గంటలకు నిర్వహించనున్న సమావేశానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

అయ్యప్ప మండల పూజా మహోత్సవం



పూజలు నిర్వహిస్తున్న మాలధారులు



శ్రీనగర్ కాలనీలో..

రామగిరి(నల్లగొండ): నల్లగొండ పట్టణం మణికంఠ నగర్‌లోని మణికంఠ స్వామి ఆలయం ఆవరణలో బుధవారం మండల పూజా మహోత్సవం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అయ్యప్ప విగ్రహానికి అభిషేకాలు చేశారు. కార్యక్రమంలో కందుల బాలరాజు, రమణ, వేముల రాములు, సుజాత, గురుస్వామి రాయపాటి శ్రీను, బచ్చు మదన్‌మోహన్, ఏదుళ్ల వెంకట్ రెడ్డి, గురు, కంజర శ్రీనివాస్, పృథ్వి పాల్గొన్నారు.

శ్రీనగర్ కాలనీలో అయ్యప్ప పడిపూజ

నల్లగొండ టౌన్: పట్టణంలోని శ్రీనగర్ కాలనీలో బుధవారం బాలరాజు, మనోహర్ గురుస్వాముల ఆధ్వర్యంలో అయ్యప్ప పడిపూజ ఘనంగా నిర్వహించారు. చెరుకు వినోద్‌కుమార్–ప్రీతి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజ చేశారు. అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో సోమా వెంకటేశ్వర్లు, చొక్కారపు మాధవి, వెంకన్న, ద్రోణ్‌కుమార్, ఏచూరి రమ, ఆద్యా, వాగ్దేవి, గుమ్మడవెల్లి ధనయ్య, డాక్టర్ కజ్జం సందీప్, మంతెన మాధవి, సుజాత, యామ కవిత, తోట సంధ్య, రాధిక, భార్గవి, పద్మావతి, లక్ష్మమ్మ , మాలధారులు తదితరులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికులకు చీరల పంపిణీ



చీరలు అందజేస్తున్న దైద రవీందర్

చిట్యాల: పట్టణానికి చెందిన యువజన కాంగ్రెస్ నాయకుడు జిట్ట భిక్షం, జిట్ట చిన్నస్వామి, జిట్ట దుర్గేష్‌ల తల్లి నర్సమ్మ ప్రథమ వర్ధంతి సందర్భంగా బుధవారం మున్సిపల్ కార్మికులకు కాంగ్రెస్ నేత దైద రవీందర్‌తో కలిసి చీరలు అందజేశారు. కార్యక్రమంలో జంపాల వెంకన్న, కృష్ణయ్య, గణేశ్ జావిద్, నర్సింహ, మల్లేష్, విష్ణు, ఆనంద్, సైదులు, పశుపతి పాల్గొన్నారు.

సోనియాగాంధీ చొరవతోనే తెలంగాణ ఏర్పాటు

మర్రిగూడ : ఎన్నో ఉద్యమాలు అనేక మంది బలిదానాలు, సోనియాగాంధీ చొరవతో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని మాజీ ఎంపీటీసీ వెంకటంపేట బాలయ్య అన్నారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లిని అవమానపరుస్తున్నారని అన్నారు. మేతరి శంకర్, సత్తిరెడ్డి, సిరిపంగి శ్రీనివాస్, యాదయ్య, కృష్ణ, సైదులు, గణేశ్, దామెర సత్తయ్య పాల్గొన్నారు.

గుణాత్మక విద్య అందించండి

మర్రిగూడ : విద్యార్థులకు గుణాత్మక విద్య అందించాలని ఎంఈఓ బిట్టు శ్రీను ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం మర్రిగూడ మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన కాంప్లెక్స్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు కళా శ్రీనివాస్, శారద, మాలతి, రిసోర్స్ పర్సన్స్ ఉదావత్ లచ్చిరాం, రమావత్ విఠల్, నేనావత్ రమేష్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినులకు సైకిళ్లు అందజేత

నల్లగొండ రూరల్: పేద విద్యార్థులకు విద్యాపరంగా సంపూర్ణ సహకారం అందిస్తామని రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ నిహారిక అన్నారు. నల్లగొండ మండలంలోని నర్సింగ్‌బట్ల హైస్కూల్‌లో చదువుకున్న ఏడుగురు బాలికలకు బుధవారం ఆమె సైకిళ్లు అందజేశారు. ఈ సందర్భంగా నిహారిక మాట్లాడుతూ విద్యార్థినులు కష్టపడి చదివి తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలన్నారు. కార్యక్రమంలో శ్యాంసుందర్, కోటిలింగం, ఎంఈఓ అరుంధతి, మారయ్య, అమర్‌నాథ్, మేఘనాథ్, సత్తయ్య, సుధాకర్, ప్రవీణ్, యాదయ్య, భూపాల్‌రెడ్డి, శ్రీదేవి, రాజు, రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.



సైకిళ్లు అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు

‘ఈ–కేవైసీ’ పై రైతుల నిర్లక్ష్యం !

- చిట్యాల మండలంలో పెండింగ్‌లో ఇంకా 281 మంది
- పెట్టుబడి సాయం నిలిచిపోయే అవకాశం !



చిట్యాల: రైతుల సంక్షేమానికి కేంద్ర ప్రభుత్వం ప్రధాన మంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన (పీఎం కిసాన్)ను 2018లో తీసుకువచ్చింది. ఈ పథకంలో రైతులకు ఎకరానికి ఏడాదికి ఆరు వేల రూపాయల చొప్పున కేంద్ర ప్రభుత్వం పెట్టుబడి సాయం అందిస్తోంది. ఈ పెట్టుబడి సాయాన్ని ఏడాదికి మూడుమార్లు ఎకరానికి రెండు వేల రూపాయల చొప్పున రైతుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ చేస్తోంది. రైతులకు పెట్టుబడి సాయం అందించడంలో పారదర్శకతోపాటు అవినీతికి తావు లేకుండా ఉండేందుకు ప్రభుత్వం బ్యాంకు ఖాతలో నేరుగా జమచేస్తోంది. ఇందుకుగాను రైతుల తమ బ్యాంకు ఖాతాకు ఈ–కేవైసీ(ఎలక్ట్రానిక్ నో యువర్ కస్టమర్) చేయించుకోవాలని నిబంధన విధించింది. ఇందులో భాగంగా రైతులు తమ ఆధార్ కార్డుకు మొబైల్ నంబర్‌ను లింక్ చేయించుకోవాల్సి ఉంటుంది. రైతులు తమ బ్యాంకు ఖాతాకు ఈ–కేవైసీ చేయించుకునేందుకు ప్రభుత్వం ఇప్పటి వరకు పలుమార్లు గడువు ఇచ్చింది. అయినప్పటికీ రైతులు ఈ–కేవైసీ చేయించుకోవడంలో నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఈ– కేవైసీ చేయించుకోని రైతులకు పెట్టుబడి సాయం నిలుపుదల చేసే అవకాశం ఉంది.

చిట్యాల మండలంలో..

చిట్యాల మండలంలో సుమారుగా 30 వేల ఎకరాలకుపైగా భూముల్లో రైతులు వివిధ రకాల పంటల సాగు చేస్తున్నారు. ఈ భూములకు సంబంధించి 2022 జూలై వరకు 8399 మంది రైతులకు బ్యాంకు ఖాతాలు ఉన్నాయి. ప్రస్తుత నిబంధనలకు అనుగుణంగా తెల్ల రేషన్ కార్డు కలిగి ఉండి ఐదు ఎకరాలలోపు గల వ్యవసాయ భూములు ఉన్న 7300 రైతు బ్యాంకు ఖాతాలు మాత్రమే ఉన్నాయి. కాగా 7019 ఖాతాలకు సంబంధించి రైతులు ఈ–కేవైసీ చేయించుకున్నారు. ఇంకా 281 బ్యాంకు ఖాతాలకు రైతులు ఈ–కేవైసీ చేయాల్సి ఉంది. 2018 నుంచి ఈ–కేవైసీపై ప్రతి వ్యవసాయ పంటల సీజన్‌లో రైతులకు వ్యవసాయ అధికారులు అవగాహన కల్పిస్తున్నారు. అయినప్పటికీ రైతులు ఈ–కేవైసీని చేయించుకోవడాన్ని పట్టించుకోవడం లేదు. త్వరలో ఈ–కేవైసీని చేయించుకునేందుకు తుది తేదీని ప్రకటించినట్లయితే పెట్టుబడి సాయాన్ని రైతులు కోల్పోవాల్సి వస్తుంది. రైతులు ఈ–కేవైసీని మీసేవ కేంద్రాలతోపాటు ఏఈఓల వద్ద, బ్యాంకుల్లో చేయించుకోవచ్చని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు.

రైతులంతా ఈ -కేవైసీ చేయించుకోవాలి



చిట్యాల మండలంలోని రైతులంతా ప్రధానమంత్రి కిసాన్ సమ్మాన్ నిధి యోజన ద్వారా పెట్టుబడి సాయం పొందేందుకు తమ బ్యాంకు ఖాతాలకు ఈ–కేవైసీ చేయించుకోవాలి. ఈ–కేవైసీ చేయించుకోని రైతులకు పెట్టుసాయం అందకపోయే అవకాశం ఉంటుంది. చిట్యాల మండలంలో 281 మంది రైతులు ఈ–కేవైసీ చేయించుకోవాల్సి ఉంది. అర్హులైన రైతులు వెంటనే ఈ–కేవైసీ చేయించుకుని పెట్టుబడి సాయం పొందాలి.

–పగిడిమర్రి గిరిబాబు.
మండల వ్యవసాయ అధికారి, చిట్యాల